క్లుప్తంగా

నేడు గ్రామసభ

గుర్ల: మండలంలోని సదానందపురంలో ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు ఉపాధి హామీ పథకం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై గ్రామంలో రామాలయం వద్ద సోమవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్యాణి ఆదివారం తెలిపారు. గ్రామంలో ఉపాధి హామీ పథకంలో సుమారు 30 మంది పనులకు వెళ్లకుండా మస్తర్లు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

విద్యార్థినికి సత్కారం



విద్యార్థి ఉమను సత్కరిస్తున్న రమణమూర్తి

గుర్ల: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని మునకాల ఉమను ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపకుడు సుంకరి రమణమూర్తి ఘనంగా సత్కరించారు.కొండగండ్రేడులో విద్యార్థిని ఉమను స్థానికులు , ఉద్యోగులు ఆదివారం దుశ్శాలువ కప్పి సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సర్పంచ్ సారిక గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు మన ప్రభుత్వం' నేడు

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామంలో సోమవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులతో పాటు అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

శిష్టకరణం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సురేష్



రేగ సురేష్

గజపతినగరం: జిల్లా శిష్టకరణం సంఘం నూతన ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పురిటిపెంట న్యూకాలనీకి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత రేగ సురేష్‌ను ఆసంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గజపతినగరం మండల శిష్టకరణం సంఘం, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఆయనకు అభినందనలు తెలిపారు. సురేష్ విలేకరులతో మాట్లా డుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నేటి నుంచి సమ్మర్ క్రాష్ ప్రోగ్రాం

శృంగవరపుకోట: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చేతిపంపుల మరమ్మతుల కోసం క్రాష్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీఓ శేషుబాబు చెప్పారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు క్రాష్ ప్రోగ్రాంను ప్రారంభిస్తారని తెలిపారు. ఒకటవ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

వైభవంగా పాదాలమ్మ జాతర మహోత్సవాలు

విజయనగరం టౌన్: స్థానిక పూల్‌బాగ్‌లో పాదాలమ్మ 38వ జాతర మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మహిళలంతా పసుపు, కుంకుమ, వేపాకులు కలిపిన నీటితో అమ్మవారికి అభిషేకాలు చేశారు. దాదాపు మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరలో భక్తులంతా పాల్గొని, అమ్మవారిని దర్శించి, తరించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం నేడు

వేపాడ: బొద్దాంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాలు, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. 2వ తేదీన గోవిందమ్మ, లక్ష్మీదేవి, జ్ఞానసరస్వతీ , భువనేశ్వరీమాత, సంతోషిమాత అమ్మవార్లకు ప్రత్యేకపూజలు, హరే రామా హరే కృష్ణ నామ సంకీర్త నిర్వహిస్తామని స్పష్టం చేశారు.


పైడితల్లమ్మ పండగ రేపు

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేటలో గ్రామ దేవత పైడితల్లమ్మ వారి పండగ మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ పెద్దలు, గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. మూడేళ్లకొకసారి అమ్మవారి పెద్దపండగ నిర్వహించడం ఆనవాయితీ. పండగ నేపథ్యంలో తొమ్మిది రోజులుగా వాలకాలు వేస్తూ ఘటాలను పురవీధుల్లో ఊరేగింపు చేస్తూ అమ్మవారి ఇంటికి తీసుకెళ్లి నివేదిస్తున్నారు. సోమవారం తొలేళ్లు, బండి ప్రభ ఉత్సవం, మంగళవారం అనుపోత్సవం నిర్వహించనున్నారు.

ఆధ్యాత్మిక సందడి



కొత్తవలస: రామలింగేశ్వరస్వామి ఆలయంలో వాసవీమాతకు సామూహిక కుంకుమార్చనలు



చీపురుపల్లి: జి.అగ్రహారంలో పూజలందుకుంటున్న గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారు



చీపురుపల్లి: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గజపతినగరం: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శృంగవరపుకోట: లక్ష్మీగణపతి ఆలయంలో వార్షికోత్సవ పూజలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో వాసవీ మాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారంలో కనకమహాలక్ష్మి అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. దశాబ్దం తర్వాత ఈ పండగ నిర్వహించడంతో అంతటా సందడి నెలకొంది. ఏప్రిల్ 27న ప్రారంభమైన అమ్మవార్ల పండగ మే 3 వరకు జరగనుంది. పట్టణంలోని జి.అగ్రహారం, రిక్షాకాలనీ, కొత్తఅగ్రహారం ప్రాంతాలకు చెందిన వారంతా ఈ పండగ నిర్వహించుకుంటున్నారు. అమ్మవార్ల పండగ ప్రారంభం సందర్భంగా తొలిరోజు రిక్షాకాలనీలో భూలోకమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం జి.అగ్రహారంలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ సమర్పించుకున్నారు. 2న జి.అగ్రహారంలో పైడితల్లమ్మ పండగ నిర్వహించనున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక పవిత్ర దినోత్సవం

చీపురుపల్లి: స్థాని హడ్కోకాలనీలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం నేతృత్వంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక ఆరాధన పవిత్ర దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు జా డ అప్పారావు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శత నామ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. మధ్యా హ్నం 2.30 గంటలకు వీరబ్రహ్మేంద్ర స్వామి జీవ సమాధి కార్యక్రమాన్ని నిర్వహించారు.

గజపతినగరంలో ...

గజపతినగరం: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలను స్థానిక పురిటిపెంటలోని సంతతోట కార్పెంటర్స్ కాలనీలోని ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆగూరు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు పెరుమాళ్ల మణికంతాచారి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులతో విశేష పూజలు చేయించారు. గజపతినగరం, పురిటిపెంట, ఎం.వెంకటాపురం, ఎస్.జి.ఆర్.పురం, దావాలపేట,బూడిపేట తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారికి పూజలు, అభిషేకాలు చేశారు.

అమ్మవారికి క్షీరాభిషేకం

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రతీ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర గ్రామంలో లక్ష్మీగణపతి ఆలయవార్షికోత్సవాన్ని అర్చకులు దొంతుకుర్తి సాయికుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకం, గరికపూజ, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు హాజరయ్యారు.

వాసవీ మాత జయంతి మహోత్సవం

కొత్తవలస: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాలను మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆర్య వైశ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

కుంకుమ పూజలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని గరివిడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జాడ కన్నబాబు నేతృత్వంలో ఉదయం 5గంటల నుంచి నగరసంకీర్తన, సుప్రభాతసేవ, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేశారు. వాసవీమాతకు వెండిచీరతో అలంకరించి 102 మంది మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. వి.వి.ఎస్.ఎస్.ఎన్. గుప్త, వెంకటరాజు, సత్యారావు, దుర్గ, జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

పెదమానాపురంలో..

దత్తిరాజేరు: పెదమానాపురంలోని వాసవీ కల్యాణ మండపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి మాత జయంతి వేడుకలను ఆర్యవైశ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు ముప్పిడి శ్రీను, అమరా రామకృష్ణ, కోట రామారావు, సత్యారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆశయ రమణ

చీపురుపల్లి: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఆశయ యూత్ అసోసియేషన్, గ్రామీణ గ్రంథాలయం అధ్యక్షుడు రెడ్డి రమణ సూచించారు. 'మీ ఇంటి వద్దకే ఉచిత పుస్తకాలు' కార్యక్రమం పట్టణంలోని రిక్షాకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు నీతి కథలు, జనరల్ నాలెడ్జ్, సమకాలీన అంశాలకు చెందిన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్డి రమణ మాట్లాడుతూ పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో విద్యార్థులు విలువైన సమయాన్ని టీవీలు, మొబైల్ ఫోన్లతో వృథా చేయకుండా పుస్తక పఠనం అలవాటు చేసేందుకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకుని పిల్లలతో పుస్తకపఠనం చేయించాలన్నారు.

పుస్తకాల పంపిణీ

గంట్యాడ: మండలంలోని పెదవేమలి పాఠశాలలో విద్యార్థులకు నీతికథల పుస్తకాల ను ఎంపీటీసీ పాటుపు రెడ్డి భవానీ, హెచ్‌ఎం సీహెచ్.ఎర్నాయుడు ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేయకుండా పుస్తక పఠనం చేసేందుకు వీలుగా ఈ పుస్తకాలు పంపిణీ చేశామని చెప్పారు.



గంట్యాడ: విద్యార్థులకు కథల పుస్తకాలు అందజేస్తున్న ఎంపీటీసీ భవాని, హెచ్‌ఎం ఎర్నాయుడు

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నార్కోటిక్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవి

చీపురుపల్లి: పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నార్కోటిక్స్ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లాన రవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రయాణికుల కోసం మానవీయత సంస్థ ఆధ్వర్యంలో ఏటా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమ న్నారు. మానవీయత సంస్థ అధ్యక్షుడు బి,వి.గోవిందరాజులు, ఎంపీటీసీ గిరడ రాందాసు, వర్తక సంఘ ప్రతినిధులు సూరు కామేష్, కింతలి మధు, సూరు కుమార్, సుంకరి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

3వ తేదీలోగా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

బొండపల్లి: కొత్తగా రైతు భరోసా పెట్టుబడి సాయం కోసం అర్హులైన రైతులు ఈనెల 3వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులతో పాటు వివిధ కారణాల వల్ల అర్హత ఉండి ఇంత వరకు పథకం ద్వారా లబ్ధిపొందని రైతులు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న మూర్తి

బొండపల్లి: క్రమం తప్పకుండా రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఫిరమిడ్ సేవాదళ్ విశాఖపట్నం అధ్యక్షుడు జి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. మండలంలోని గొట్లాం గ్రామంలోని సత్యసాయి ఆలయ ఆవరణలో విజయనగరం ఫిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో యోగా, ధ్యానంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం యోగా, ధ్యానానికి కేటాయించాలని చెప్పారు. యోగా, ధ్యానం వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు దీర్ఘకాలిక రోగాలు నుంచి ఉపశమనం పొందవచ్చని వివరించారు. విజయగనగరం జిల్లా ఫిరమిడ్ సేవాదళ్ అధ్యక్షుడు వి.రామకృష్ణరాజు పాల్గొన్నారు.

నియామకపత్రాల అందజేత నేడు

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం నియామక పత్రాలు పంపిణీ చేయన్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతారని పేర్కొన్నారు.

నిత్యన్నదానానికి రూ.24 వేల సహకారం



నగదు అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ వెంకటరావు, దాత కృష్ణ

చీపురుపల్లి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి నలుగురు దాతలు రూ.24 వేల ఆర్థిక సహకారం అందజేశారు. మెరకముడిదాం మాజీ జెడ్పీటీసీ కోట్ల వెంకటరావు, తుమ్మల గణేశ్‌కుమార్, పి.కృష్ణ, ఎస్. రామకృష్ణ కలిసి లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఎస్.సన్యాసిరావుకు ఆదివారం నగదు అందజేశారు. ఏటా ఇదే మాదిరిగా శాశ్వత అన్నదాన పథకానికి సహకారం అందిస్తామని దాతలు హామీ ఇచ్చారని సన్యాసిరావు చెప్పారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శాశ్వత అన్నదాన పథకంలో 30 మంది నిరాశ్రయులకు రోజూ అన్న దానం చేస్తున్నామని, దాతలు ముందుకొచ్చి పథకం నిర్వహణకు సహకారం అందించాలని కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



గుర్రం జాషువా పద్యాలను రాగయుక్తంగా ఆలపిస్తున్న సినీ కళాకారుడు తిరుపతినాయుడు

విజయనగరం అర్బన్: స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మే 1వ తేదీన మేడే పురస్కరించుకుని, సకల కార్మికుల కళా సందడి పేరిట చేపట్టిన ఈ కార్యక్రమంలో పలు కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొని, ఎంతో ఉత్సాహంతో తమ కళలను ప్రదర్శించారు. రంగస్థల నటుడు, సినీ కళాకారుడు దాసరి తిరుపతినాయుడు గుర్రం జాషువా పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. ఖవాలీ పాటలను గ్రామసేవక్ సంఘ నాయకుడు కె.గురుమూర్తి పాడి, శ్రోతలకు వీనులవిందు చేశారు. గాజులరేగ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన బృంద నృత్య ప్రదర్శన చూపరులను మంత్రముగ్దుల్ని చేసింది. విప్లవ గీతాలకు అంగన్‌వాడీ సంఘ నాయకురాలు సత్యవతి చేసిన నృత్యాభినయం, ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు ప్రదర్శించిన లఘునాటిక ఆద్యంతం అలరించాయి. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కే.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎంపిక



నియామక పత్రం అందజేస్తున్న సంఘ జిల్లా అధ్యక్షుడు గంగాప్రసాద్

విజయనగరం అర్బన్: ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా చందక శ్రీనివాసరావు (దివ్యాంగుల సంక్షేమ శాఖ)ను ఎంపిక చేసినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు మువ్వల గంగాప్రసాద్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఇటీవల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సంఘ కార్యాలయంలో శ్రీనివాసరావుకు నియామకపత్రం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి.రామలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి డి.పైడితల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాడితల్లి అమ్మవారి ఉత్సవాలు

బొబ్బిలి: స్థానిక గొల్లపల్లిలో దాడితల్లి అమ్మ వారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి పోటెత్తిన భక్తులు ఈ ఏడాది అంతా పంటలు బాగా పండాలని, అందరూ బాగుండాలని అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం ఉయ్యాల కంబాల ఉత్సవం అత్యంత వైభవంగా చేశారు. ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతి క కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పేద ప్రజల సంతోషమే లక్ష్యం



మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: పేద ప్రజల సంతోషం, వారి అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామలింగాపురం గ్రామంలో రాష్ట్ర వెలమకార్పొరేషన్ చైర్మన్ నెక్కలినాయుడుబాబుతో కలిసి ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలు తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు తెలిపిన సమస్య లను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ తన పాలనతో అసలైన ప్రజాప్రభుత్వం ఎలా ఉంటుందో చూపించారని అన్నారు. ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని, పథకాలను పార్టీలక తీతంగా పారదర్శకంగా అందిస్తున్నట్లు చెప్పారు.రానున్న ఎన్నికల్లో ఏదో ఒక విధంగా గద్దెనెక్కాలని టీడీపీ కుట్రలు పన్నుతోందని, వారి మాయలోపడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సేసూచించారు. ఒక వైపు సంక్షేమ పథకాల అమల్లో, మరో వైపు అభివృద్ధి పనుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు దీటుగా ముందుకు దూసుకుపోతోందన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పలు పథకాలను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలే కాకుండా అంతర్జాతీయ సంస్థలు కూడా పోటీపడుతున్నాయన్నారు. ఇంత విజన్ ఉన్న జగన్ రాష్ట్రానికి పదికాలాల పాటు ముఖ్యమంత్రిగా ఉండడం ఎంతో అవసరమన్నారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, రామలింగాపురం, కొత్తవలస సర్పంచ్‌లు నెక్కలి గౌరినాయుడు, మచ్చ రామస్వామి, ఎంపీటీసీ లెంక వరహాలు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జి మెరపల సత్యనారాయణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, గొరపల్లి రవికుమార్, గణేష్, పైడింనాయుడు, దేమున్నాయుడు, సాల్మన్‌రాజు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

త్వరలో బిల్లులు జమ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవనాలకు సంబంధించిన బిల్లులను కాంట్రాక్టర్ల ఖాతాల్లో త్వరలో జమ చేయనున్నట్టు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. మండలంలోని దత్తి గ్రామంలో ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పెండింగ్ విషయాన్ని మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. బిల్లులు పైసా పెండింగ్ లేకుండా మే నెలాఖరు నాటికి చెల్లించేందుకు హామీ ఇచ్చారని అన్నారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి మంచి స్పందన రావడంతో ముఖ్యమంత్రి అభినందించారని, పూర్తి సమయం ప్రజల మధ్యనే గడపాలని ఆదేశించారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు.